సర్కారు బడి.. సమస్యల ఒడి

- ఆగిన భవన నిర్మాణ పనులు
- అద్దె భవనంలో పాఠశాల
- విద్యార్థులకు ఇక్కట్లు



సర్వర్‌ఖాన్ పేట ఉర్దూ స్కూల్‌లో పిల్లర్ల వరకు ఉన్న భవనం



ఆంజనేయకొట్టాల గ్రామంలో అసంపూర్తిగా భవన నిర్మాణం

ఖాజీపేట : ప్రభుత్వ పాఠశాలలు సమస్యల నిలయాలుగా మారాయి. కొత్త భవనాల నిర్మాణ పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. దీంతో అద్దె భవనంలో స్కూల్ నడుస్తోంది. పర్యవసానంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఖాజీపేట మండలంలో పాడుపడిన భవనాలు, పై స్లాబ్ పెచ్చులు ఊడి లీకేజీ అవుతున్న భవనాలను అధికారులు గుర్తించారు. అలా ఉన్న స్కూల్ భవనాలు ఆంజనేయ కొట్టాలులో రెండు, పుల్లూరు పంచాయతీలోని ఉర్దూ స్కూల్‌లో ఒకటి, టీచర్స్ కాలనీలోని ఒక భవనం గుర్తించారు. వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని అధికారులు భావించారు. అందుకు తగ్గట్లుగా కొత్త భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు.

2020లో పనులు మొదలు

ఆంజనేయకొట్టాలులో రెండు భవనాలు సుమారు రూ.21 లక్షలు, సర్వర్‌ఖాన్ పేటలో రూ.11 లక్షలు, టీచర్స్‌కాలనీలో రూ.11 లక్షలతో ఒక్కో భవన నిర్మాణ పనులను 2020 నవంబర్‌లో మొదలు పెట్టారు. కాంట్రాక్టర్లు కొంత వరకు పనులు చేశారు. కానీ వాటికి బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆపేశారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేస్తామని చెప్పడంతో సగంలో నిలిచిపోయాయి. ఫలితంగా ఆంజనేయకొట్టాలు గ్రామంలో గడచిన నాలుగు సంవత్సరాలుగా అద్దె భవనంలో స్కూల్ నడుస్తోంది. అద్దె భవనంలో ఉండటంతో స్కూల్‌లో విద్యార్థులు చదువుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

రెగ్యులర్ టీచర్ లేరు

ఆంజనేయకొట్టాలు గ్రామంలో ఉన్న స్కూల్‌కు రెగ్యులర్ టీచర్ లేక ఏడాది అవుతోంది. ఒక టీచర్ మృతి చెందడం మరొక టీచర్ పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి తాత్కాలిక టీచర్ వస్తున్నారు. పోతున్నారు. ఫలితంగా విద్యార్థులపై ప్రభావం పడి విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అధికారులు స్పందించి రెగ్యులర్ టీచర్‌ను వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

మూడేళ్లుగా పరిష్కారం లేదు

గడిచిన మూడు సంవత్సరాలుగా స్థానికులు, కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోయి సమస్యల గురించి చర్చించారు. అధికారులు స్పందించలేదు. జిల్లా పరిషత్ సమావేశంలో కూడా వీటిపై జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా స్పందన లేక పోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



టీచర్స్‌కాలనీలో నిర్మాణం నిలిచిపోయిన భవనం



ఆంజనేయ కొట్టాలు గ్రామంలో అద్దె భవనంలో నడుస్తున్న స్కూల్



అద్దె భవనంలో చదువుకుంటున్న విద్యార్థులు

త్వరగా భవనాలు నిర్మించాలి



నా కుమారుడు గురువిజవ్ 4వ తరగతి చదువుతున్నాడు. ఉన్న స్కూల్ కారుతుంటే తొలగించి కొత్త భవనాలు కడుతున్నారు. నాలుగేళ్లుగా అధికారులు కడుతూనే ఉన్నారు. స్కూల్‌లో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. త్వరగా భవనాలు పూర్తి చేయాలి. అద్దె భవనాల్లో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

– సునీత విద్యార్థి తల్లి, ఆంజయకొట్టాలు

రెగ్యులర్ టీచర్‌ను నియమించాలి



మాకు రెగ్యులర్ టీచర్ లేరు. తాత్కాలికంగా టీచర్లను మారుస్తున్నారు. కడుతున్న స్కూల్‌ను త్వరగా పూర్తి చేసి రెగ్యులర్ టీచర్‌ను వేస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. విద్యార్థులకు బాగుంటుంది.

– ప్రణీత్, రెండవ తరగతి, ఆంజనేయకొట్టాలు

పాత పనులను మార్చి ఇస్తే కడతాం



బిల్లులు సక్రమంగా రావడం లేదు. అందుకే భవనాలు కట్టడం కష్టంగా ఉంది. పాత ధరలకు కాకుండా ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా వర్కు మార్చాలి. బిల్లులు త్వరగా ఇస్తే పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– మున్వర్, కాంట్రాక్టర్, సర్వర్‌ఖాన్ పేట

నివేదికలు పంపించాం

మూడు స్కూల్ భవనాలు అసంపూర్తిగా ఉన్న మాట నిజమే. నిధులు లేక ఆలస్యం జరిగింది. పనులు చేసిన వరకు నాలుగు నెలల క్రిందట బిల్లులు చెల్లించాం. మిగిలిన పనుల పూర్తికి ఉన్నతాధికారులకు నివేదించాం. డబ్బులు పడగానే పనులు పూర్తి చేయిస్తాం.

– నాగేంద్ర ప్రసాద్, సర్వశిక్ష అభియాన్ ఇంజినీర్

క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. పెన్నానది తీరంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అమృతేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొవ్వూరు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నామా రమేష్ బాబు, సభ్యులుగా టంగుటూరు మారుతీ ప్రసాద్, నామా రమేష్ బాబు, కార్యదర్శిగా నామా వాసు, సహాయ కార్యదర్శులుగా వల్లంకొండు రఘు వంశీ, కళాసాగర్, కోశాధికారిగా విజయ్‌లను ఎన్నుకున్నారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధి, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం దసరా ఉత్సవాల నిర్వహణపై చర్చించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక మనోజీరావు వీధి, శంకర్‌రావు వీధి, శ్రీరాముల పేటలలో బీజేపీ సభ్యత్వ నమోదు ఆదివారం చేపట్టారు. 13వ వార్డు బీజేపీ ఇన్‌చార్జి నరేష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీపీ.జయలక్ష్మి, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్, కుమారి, రవి, రాగాల రమణయ్య, చలపతిరావు, పరమేశ్వరరావు, సుధాకర్‌రావు, శ్రీశ్రీ, గౌరీశంకర్, గంగాధర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ

పోరుమామిళ్ల : పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం వాహనాలను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తనిఖీ చేశారు. సరైన పత్రాలులేని వాటికి జరిమానా విధించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక వసంతపేటలోని ఆణా బంకు వద్ద పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 28 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.


ఆర్థిక సాయం



వధువును ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ముబారక్‌నగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌వల్లి కుమార్తె షేక్‌సుబానీ వివాహం సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో రూ.1.02 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఖాదర్‌వల్లి ఇంటి వద్ద జరిగిన హల్దీ ఫంక్షన్‌లో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డిలు వధువును ఆశీర్వదించి నగదుతో పాటు బట్టలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాదర్‌వల్లి నిరుపేద కుటుంబానికి చెందినవారైనప్పటికీ పార్టీ తరపున జరిగే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటుండేవాడన్నారు. అటువంటి కార్యకర్త ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి పార్టీ నాయకుల సహకారంతో ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, అట్లూరు మండల జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, రెడ్డెయ్య, బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సామగ్రి పంపిణీ



వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దూదేకుల సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: విజయవాడ వరద బాధితులకు వస్తు సామగ్రి పంపిణీ చేశామని దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆయిల్ మిల్ ఓబులేసు, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదాందుల్లా పేర్కొన్నారు. విజయవాడలోని ముంపు ప్రాంతాలైన పాత రాజరాజేశ్వరిపేట, గొల్లపూడి, బొమ్మసాని సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో ఆదివారం వారు పర్యటించారు. అనంతరం బాధితుల ఇబ్బందులను గమనించి దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చీరలతో కూడిన సామగ్రి పంపిణీ చేశారు.

కార్పెంటర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగసానిశివయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షులుగా షేక్‌దావూద్‌వలి, ఉపాధ్యక్షులు మీరాన్‌సాహెబ్, వెంకటరాజేష్, సెక్రటరీగా కొమ్మురాజుశ్రీనివాసులు, ట్రెజరర్‌గా శౌరి, జాయింట్ సెక్రటరీగా ఖాదర్‌బాషాలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివయ్య మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సంస్మరణ సభను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : ఈనెల 27న కడప ప్రెస్ క్లబ్‌లో జరిగే కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ పిలుపిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో పార్టీ నాయకులతో కలసి ఆదివారం సంస్మరణ సభ కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. ఢిల్లీ నడిగడ్డపై ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తెలుగుబిడ్డ అన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన అందించిన సేవలు అద్భుతమన్నారు. సంస్మరణ సభకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, జాతీయ నాయకులు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న తీట్ల చిట్టిబాబు

మైదుకూరు : ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని మాలమహానాడు యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తీట్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆ సంఘం నాయకులు బండి పుల్లయ్య, భూమిరెడ్డి చిన్న మాధవయ్యలతో కలసి విలేకరులతో మాట్లాడారు. రఘురామ కృష్ణంరాజు బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం శోచనీయమన్నారు. ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రఘురామకృష్ణంరాజు ఒక ప్రజాప్రతినిధిగా సమాజంలో ఉండటం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. ఆయన భారత రాజ్యాంగం ద్వారానే ఎన్నికయ్యాడన్న విషయాన్ని మర్చిపోయినట్లు ఉన్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన్ను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కుటుంబ నిర్మాణంలో స్త్రీల పాత్ర గొప్పది



మాట్లాడుతున్న భారతి

మైదుకూరు : పట్టణంలోని శాంతినగర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఘనంగా స్త్రీల మైత్రి కూడిక నిర్వహించారు. సంఘ గురువు రెవరెండ్ శామ్యూల్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ డయాసిస్ ప్రెసిడెంట్ సీడీ భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలకు దేవుని వర్తమానాన్ని అందించారు. కుటుంబ విలువలు, కుటుంబాన్ని ప్రార్థన ఆధారంగా ఎలా బలపరుచుకోవాలో తెలియజేశారు. కుటుంబాలను కట్టుకోవడంలో స్త్రీలదే కీలకపాత్ర. కుటుంబంలో ఏ సమస్య అయినా ఉంటే దేవుని యందు సమాధానం పొందాలే గాని క్షణికావేశంతో గొడవలు పడుతూ కుటుంబంలో శాంతిని దూరం చేసుకోకూడదని సూచించారు. పిల్లలను ఆధ్యాత్మికంగా ఎదిగేలా తల్లులు కృషి చేయాలన్నారు. అనంతరం సీడీ భారతిని స్త్రీల మైత్రి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రాజుపాళెం సర్వేయర్‌గా విజయభాస్కర్

రాజుపాళెం: రాజుపాళెం సర్వేయర్‌గా ఆర్.విజయభాస్కర్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ గురుశేఖర్ జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయభాస్కర్ బి.కోడూరు మండలం నుంచి ఇక్కడికి వస్తున్నారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

టీటీడీలో అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలి

వైవీయూ: టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. కడప నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధ సంస్థ టీటీడీలో గతంలో జరిగిన అవకతకలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి టీటీడీ పవిత్రతను దెబ్బతీసే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, హరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేల్ పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మహిమను కొట్టిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సభ్యులు రాజేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలలో న్యాయం జరగలేదు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్, రీజియన్ పరిధిలో జరిగిన బదిలీల్లో ఏ సెక్షన్‌కు న్యాయం జరగలేదని కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి పురుషోత్తం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బదిలీల్లో నిబంధనలు గాలికి వదిలేశారన్నారు. ఈడీ సమీక్షించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్-4, కడప రీజియన్ వ్యాప్తంగా ఈ నెల 21న జరిగిన బదిలీల్లో అధికారులు ఏక పక్షంగా వ్యవహరించారని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.ఆర్.మూర్తి, రాము తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ అధికారులు జీవో ప్రకారం ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగి కోరితే బదిలీ చేయాలనే నిబంధన బేఖాతరు చేశారని తెలిపారు. కొన్ని సెక్షన్లలో వెళ్లాలనుకున్న ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు



యంత్రాలతో చదును చేసిన ఐత్రంపేట కొండ ప్రాంత భూమి

బి.కోడూరు : ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్న చందంగా అధికారపార్టీ నాయకులు హవా నడుపుతున్నారు. కొండ ప్రాంతాలను సైతం ఆక్రమణలు చేసుకుని డోజర్లు, జేసీబీలతో చదును చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిన్నటి వరకు నీతులు చెప్పిన అధికారపార్టీ నాయకులు ఏకంగా కొండను సైతం ఆక్రమించుకుని దందా నడుపుతున్నారు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు చేసేదేమీ లేక చోద్యం చేస్తున్నారు. మండలంలోని ఐత్రంపేట గ్రామపొలానికి చెందిన సర్వేనెంబర్ 2735లో సుమారు 120 ఎకరాల కొండ ప్రాంతానికి చెందిన భూమి ఉంది. అధికారపార్టీ నాయకులు కొంత మంది రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించుకుని దొడ్డి దారిన ఆన్‌లైన్ చేయించుకున్నారు. వారం రోజులుగా సాగు చేసుకుంటూ బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలకు చెందిన కొంత మంది నాయకులకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప తగు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఐత్రంపేట పంచాయతీ పరిధిలో భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన సుమారు వంద మందికి పైగా ఉన్నప్పటికీ వారికి అందకుండా అధికారపార్టీ నాయకులు చూస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ఆక్రమణకు గురవుతున్న కొండ ప్రాంత భూమిని అడ్డుకుని అనువైన భూమిని అర్హులైన లబ్ధిదారులకు అందించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రొద్దుటూరులో వర్షం

ప్రొద్దుటూరు : పట్టణంలోని ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై నిలిచిన వర్షం నీటిని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పరిశీలించారు. మురికి కాలువల్లోకి మళ్లించాలని సిబ్బందికి సూచించారు. గాంధీ రోడ్డు, కొర్రపాడు రోడ్డులోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంకు సమీపంలో వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకున్నారు.



వర్షం నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



గోపవరం ఎస్టీకాలనీలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

గోపవరం : పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా గోపవరం ఎస్టీకాలనీలో పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయడం, కుళాయిల వద్ద నీరు వృధాగా పోకుండా చూడటం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రీన్‌అంబాసిడర్లు, గ్రీన్ గార్డు కుటుంబ సభ్యులకు వైద్యశిబిరం ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్, ఏఎన్ఎం సుజాత, మహిళా పోలీసు మహేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా దసరా ఏర్పాట్లు



అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేస్తున్న పందిరి



ఆలయంలో మెరుగులు దిద్దుతున్న కార్మికులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో దసరా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో చలువ పందిళ్లు, ఆలయంలో సెట్టింగ్‌లు చేయడంతోపాటు శుభ్రపరుస్తున్నారు. పలు ప్రాంతాల కార్మికులు ఈ పనుల్లో నిమగ్న మయ్యారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ప్రతినిధులు సమావేశం నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట బ్లాక్ డే

కడప వైఎస్ఆర్ సర్కిల్: అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వామపక్ష కార్మిక, రైతు సంఘాల జిల్లా నాయకులు నాగసుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేశంలో రైతులను రక్షించే విత్తన చట్టం లేదని, పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతుల ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడాన్ని మోసగించడం దారుణమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, బాదుల్లా, చంద్రారెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యకరమైన జీవనం

కడప కల్చరల్: టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు సూష్మ, అలేఖ్య, కిరణ్, సుప్రియ పేర్కొన్నారు. కడప ఓం శాంతి నగర్‌లో ఆదివారం సీటీజీ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సేంద్రియ ఆరోగ్యవంతమైన గార్డెన్ ఏర్పాటు సంతోషకరమన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న వారిలో ప్రత్యేకమైన సేంద్రీయ ఆహార వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో టెర్రాస్ గార్డెన్‌ను విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సేంద్రియ పెంపకానికి సంబంధించి పలు రకాల కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 60 మంది సభ్యులు పాల్గొన్నారు.